నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: విద్యుత్ మరమ్మతుల పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సూరారం విలేజ్, మరాఠీబస్తీ, రాజీవ్‌గృహకల్ప, తెలుగుతల్లి నగర్, మైత్రినగర్, సూరారంకాలనీ, 60గజాలు, తులసీ కన్‌స్ట్రక్షన్స్, గ్రీన్‌హిల్స్ కాలనీల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కోకకోలా, అపర్ణ ఫీడర్ల పరిధిలో

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కోకకోలా, అపర్ణ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కోకకోలా ఇండస్ట్రీ ఏరియా, అపర్ణ కంపెనీ, ఎస్‌జేఆర్ కన్‌స్ట్రక్షన్స్, డాల్ఫిన్ డెవలపర్స్, కోకకోలా–బొల్లారం చౌరస్తాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పోరాట యోధుడు చేగువేరా

హిమాయత్‌నగర్: గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీభవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నెస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. చేగువేరా జయంతిని ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ... క్యూబాలో జన్మించిన చేగువేరా తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని అన్నారు ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు మజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, జగన్, వినోద్, లతీఫ్, హసీమ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

లిబర్టీ: మున్సిపాలిటీలో నిరంతరం పరిశుభ్రత కోసం పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 28 వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పొందుతున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదని అన్నారు. లిబర్టీ వద్ద ఉన్న మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అమల్లో ఉన్న వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర కటింగ్ మున్సిపల్ కార్మికులకి చేతికి వచ్చేది రూ. 14 వేలు మాత్రమే అన్నారు. ఈ వేతనంలో పట్టణాలు, మున్సిపాలిటీల్లో ఎలా జీవనం సాగిస్తారని ఆయన ప్రశ్నించారు. అయినా వారిని పర్మనెంట్ చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా వారి సేవలను గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకుడు రాములు పాల్గొన్నారు.

జైదుర్గ నవదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సన్మానిస్తున్న ఆలయ కమిటీ

కుత్బుల్లాపూర్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సీసలబస్తీలోని జైదుర్గ నవదుర్గ ఆలయ మొదటి వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. శ్రీవారి బ్రహ్మోత్సవం

- నేత్రపర్వంగా సాగిన శ్రీవారి సూర్యప్రభ వాహన సేవ
- అంగరంగ వైభవంగా టీటీడీ బ్రహ్మోత్సవాలు



హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ లిబర్టీలోని తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అందులోభాగంగా రెండవ రోజు శుక్రవారం స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం ఉదయం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా సూర్యనారాయణుడు సూర్యప్రభామధ్యస్థుడై దివ్యకిరణ కాంతుల్లో ప్రకాశిస్తూ సూర్యప్రభ వాహనంలో దర్శనమిచ్చారు. సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకంగా పేర్కొన్నారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈటల రాజేందర్‌కు నేతల సత్కారం

సుభాష్‌నగర్: మల్కాజిగిరి లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన ఈటల రాజేందర్‌ను శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఆయన ఈటల రాజేందర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దేవర రమేష్, గిరిజన మోర్చా కుత్బుల్లాపూర్ కన్వీనర్ అంగిడి మల్లేష్, బూత్ అధ్యక్షుడు బాలరాజు, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

నేటికీ మట్టి రోడ్లే.!

- తిరుమల ఎంక్లేవ్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీ ఏర్పడి పుష్కరకాలం అవుతున్నా సీసీరోడ్లు లేని వైనం
- మట్టి రోడ్లలో కుంగుతున్న వాహనాలు • క్రేన్లు రప్పించి వాహనాలను బయటకు తీయిస్తున్న స్థానికులు



దిగబడిన వాహనాన్ని తీయబోయి మరో వాహనం బురదలో కూరుకుపోగా క్రేన్ సాయంతో బయటకు తీసిన దృశ్యం



బురదలో కూరుకుపోయిన పోలీస్ వాహనం



బురదమయంగా శ్రీరాంనగర్ రోడ్ నం.2



మట్టిలో దిగబడిన డీసీఎం

సుభాష్‌నగర్: అక్కడ చినుకు పడిందంటే చిత్తడే.. ఓ మోస్తారు వర్షం రోడ్లన్నీ బురదమయమే. ఆ కాలనీ ఏర్పడి పుష్కరకాలమైనా కనీసం సీసీ రోడ్ల నిర్మాణానికి నోచుకోవడం లేదు. సూరారం డివిజన్ తిరుమల ఎంక్లేవ్‌లోని శ్రీరామ్‌నగర్ ఏర్పడి 12 సంవత్సరాలు కావొస్తుంది. ప్రస్తుతం ఈ కాలనీలో 80 శాతం మేర నిర్మాణాలు వెలిశాయి. మొత్తం కాలనీలో రెండు చోట్ల మాత్రమే సీసీరోడ్లు ఉన్నాయి. మిగతా 12 ప్రాంతాల్లో సీసీ రోడ్లను నిర్మించ లేదు. పక్కనే ప్రభుత్వ స్థలంలో వెలసిన బస్తీలో సైతం సీసీ రోడ్లు ఉండగా ఇక్కడ మాత్రం ఇంకా మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే రోడ్లన్నీ బురదమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భారీ వాహనం వస్తే...

కాలనీకి ఇంటి నిర్మాణం కోసం అవసరమయ్యే ముడి సరుకు లోడుతో ట్రాక్టర్, లారీ ఇతర వాహనాలు వస్తే రోడ్డులో దిగబడి నానా తంటాలు పడుతున్నారు. ఇలా రోజుకు ఏదో వాహనం అక్కడికి రావడం, రోడ్డులో దిగబడడం క్రేన్ సహాయంతో బయటకు తేవడం పరిపాటిగా మారింది.

ఒకదాన్ని తీయబోయి మరొకటి..

గత నెలలో కురిసిన వర్షానికి పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఆ కాలనికి రాగా బురదలో కూరుకుపోయింది. దీంతో మరో పోలీసు వ్యాన్ సహాయంతో ఆ వాహనాన్ని తీసేందుకు ప్రయత్నిస్తుండగా సదరు వాహనం కూడా బురదలో దిగబడింది. చేసేది ఏమి లేక ఒక క్రేన్ రప్పించి రెండు వాహనాలను బయటకు తీశారు. దీంతో బతుకు జీవుడా అంటూ ఆ పోలీసులు బయటపడ్డారు.

మొర పెట్టుకున్నా..



శ్రీరామ్ నగర్ కాలనీకి సీసీ రోడ్లు కల్పించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఇంత వరకు కల్పించలేదు. కేవలం ప్రధాన రోడ్డు మరొక సీసీ రోడ్లు మాత్రమే వేశారు. ఇంకా మా కాలనీలో 12 రోడ్లలో సీసీ వేయలేదు. వర్షం పడిందంటే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి.

– సురేష్ బాబు, శ్రీరామ్‌నగర్, ప్రెసిడెంట్

వాహనాలను ఆమడ దూరంలో పెట్టాల్సిందే..



వర్షాకాలంలో కాలనీలోకి ఏదైనా వాహనాలు వస్తే దూరంగా పెట్టి కాళ్లకు పని చెప్పాల్సిందే. ఇక ఇంటి నిర్మాణం కోసం వచ్చే భారీ వాహనాలు లారీ, ట్రాక్టర్లు అక్కడే నిలిపి చిన్న ట్రాలీ ఆటో ద్వారా సరుకులు తెచ్చుకుంటున్నాం. ఇక అత్యవసర సమయంలో అంబులెన్స్, పోలీస్ ఇతర వాహనాలు కాలనీ లోకి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సీసీ రోడ్లు కల్పించాలని కోరుతున్నాం.

– శ్రావణ్ కుమార్, కాలనీవాసి

24గంటలు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ సేవలు



ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న డీజీఎం రాజేష్, సెక్షన్ మేనేజర్ పూజిత

చింతల్: వర్షాకాలంలో రోడ్లపై నిలుస్తున్న వరద నీటిని తోడేందుకు జలమండలి సిద్ధమైంది. శుక్రవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో అధికారులు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వాహనాన్ని డీజీఎం రాజేష్, సెక్షన్ మేనేజర్ పూజితతో కలిసి ప్రారంభించారు. ఈ వాహనం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ వాహనం మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ వాహనానికి రూ.4లక్షల మేర నిధులు వెచ్చించి 3నెలల పాటు ఆయా సెక్షన్ల పరిధిలో నీటి సమస్యలను తొలగించేందుకు ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

పది సెక్షన్లకు ఒక్క వాహనమే..

గతంలో రెండు సబ్ డివిజన్లు నాలుగు సెక్షన్లు ఉండగా రెండు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వాహనాలను జలమండలి సమకూర్చింది. కానీ ఈ ఏడాది కేవలం ఒక్క వాహనంతో సరిపెట్టింది. నేడు అనేక బస్తీలు, కాలనీలు వెలిశాయని కేవలం ఒకే ఒక వాహనం ఎలా సరిపోతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతాం



సమస్యలను వింటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను నివేదించారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ... దశల వారీగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. పదేళ్ల కాలంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా షెడ్డు ఏర్పాటు



చిత్తారమ్మ ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారం చిత్తరమ్మ ఆలయం ముందు భక్తులకు ఇబ్బందులు కలగకుండా షెడ్డును ఏర్పాటు చేశారు. షెడ్డు ప్రారంభోత్సవం నేపథ్యంలో శుక్రవారం షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్యగౌడ్, కమిటీ సభ్యులు పెంటారెడ్డి, బాలరాజు, నరసింహ, సత్తయ్య తదితరులు సమావేశం అయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అలయ కమిటీ దాతల సహాయంతో గుడి చుట్టూ షెడ్డు ఏర్పాటు చేశామని చైర్మన్ అంతయ్యగౌడ్ తెలిపారు. షెడ్డు పనులు తుది దశకు చేరుకోవడంతో ప్రారంభోత్సవానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ పేర్కొంది.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

జగద్గిరిగుట్ట: ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడామేస్త్రీనగర్‌కు చెందిన మిర్జా ఖయ్యూం, ఫరీదాబేగం(36)లు భార్యాభర్తలు. ఈ నెల 1వ తేదీన భార్యాభర్తల మధ్య గొడవ జరగింది. దీంతో మరుసటి రోజు ఇంట్లో చెప్పకుండా ఫరీదా వెళ్లిపోయింది. ఆమె కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి..

జగద్గిరిగుట్ట: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌కు చెందిన దామెర రాజుకు ముగ్గురు కుమారులు, పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమార్తె రక్షిత(19)లు ఉన్నారు. కాగా ఈ నెల 12న పని నిమిత్తం రాజు తన సొంత గ్రామానికి వెళ్లాడు. 13వ తేదీ రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించారు. కాగా రాత్రి 3 గంటల సమయంలో రాజు భార్య నిద్ర లేచి చూసేసరికి కుమార్తె రక్షిత కనిపించలేదు. ఆమె మొబైల్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీసులను కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చెప్పాపెట్టకుండా వెళ్లిపోయిన యువకుడు

తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

జగద్గిరిగుట్ట: ఇంట్లో చెప్పాపెట్టకుండా ఓ యువకుడు వెళ్లిపోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు ఇందిరనగర్‌కు చెందిన అక్బర్ కుమారుడు చాంద్‌పాషా(20) జగద్గిరిగుట్టలోని బంధువుల వద్ద ఉంటున్నాడు. అయితే ఈనెల 11న ఉదయం 9గంటల ప్రాంతంలో బంధువులకు చెప్పకుండా చాంద్‌పాషా వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ద్వారా సమాచారం అందుకున్న యువకుడి తల్లిదండ్రులు శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భార్యతో గొడవ పడి వెళ్లిపోయిన భర్త

మిస్సింగ్ కేసు నమోదు

జగద్గిరిగుట్ట: భార్యతో గొడవ పడిన భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట లెనిన్‌నగర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి శ్రీకాంత్(32), శ్రీలక్ష్మిలు భార్యాభర్తలు. తరచూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈనెల 13న మధ్యాహ్నం 3గంటల సమయంలో శ్రీకాంత్ భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సాయిరామ్‌చారి

సుభాష్‌నగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన సాయిరామ్‌చారి(31), శిరీషలు భార్యాభర్తలు. కాగా కార్పెంటర్ పనులు చేసి సాయిరామ్‌చారి తరచూ తాగొచ్చి ఇంట్లో గొడవ పడేవాడు. ఈనెల 13న సాయంత్రం 5.45 ప్రాంతంలో తాగి ఇంటికి వచ్చిన అతడు కుటుంబ సభ్యులను దుర్భాషలాడాడు. అనంతరం బెడ్ రూమ్‌లోకి వెళ్లి మద్యం మత్తులో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వారి సహాయంతో అతడి కిందకు దించారు. సూరారం నారాయణ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రాంతంలో వ్యక్తి..



లఖణ్ సంజయ్ (ఫైల్)

సుభాష్‌నగర్: తాగొచ్చి భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం లాస్ట్ బస్టాప్ సమీపంలో నివాసముండే మహారాష్ట్రకు చెందిన లఖణ్ సంజయ్(27), నిషా భార్యాభర్తలు. హెటిరోలో పనిచేసే సంజయ్ ఈనెల 11న తాగి ఇంటి కొచ్చాడు. భార్యతో గొడవ పడిన అతడు ఇంట్లో టీవీ, మొబైల్‌ను పగులగొట్టాడు. మరుసటి రోజు నిద్ర లేచి చూసే సరికి సంజయ్ కనిపించలేదు. కుటుంబ సభ్యులు అతడి జాడ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య నిషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తను పారిశుద్ధ్య ఆటోలకు ఇవ్వండి



భగత్‌సింగ్‌నగర్‌లో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

జరిమానా నుంచి తప్పించుకోండి

చింతల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని శుక్రవారం భగత్‌సింగ్‌నగర్‌లో ఎస్ఎఫ్ఎల్‌లు వెంకటేష్, రామకృష్ణ అవగాహన కల్పించారు. భగత్‌సింగ్‌నగర్ కమిటీహాల్ సమీపంలోని కాల్వ పక్కనే స్థానికులు చెత్త వేస్తుండటంతో అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త సేకరణ ఆటో రిక్షాలకే ఇంట్లోని చెత్తను ఇవ్వాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.వేయి జరిమానా విధించాల్సి ఉంటుందని తెలిపారు. వర్షాకాలంలో విష జ్వరాల ప్రబలే అవకాశం ఉంటుందని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇది జరగాలంటే స్థానికులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిసు వెంకటేశంగౌడ్, ఎల్లేష్, నాగిరెడ్డి, ఆర్పీలు విద్య, నీలిమ, జ్యోతి, భవాని, కార్మికులు పాల్గొన్నారు.

గ్రూప్‌-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్‌–2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్ నాయక్ పేర్కొన్నారు. గ్రూప్‌–2లో 1500, గ్రూప్‌–3లో 2500 ఉద్యోగాలు పెంచేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అలాగే గ్రూప్‌–1 మెయిన్స్‌కు 1:100 ఇచ్చేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడులు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ కాసాని సుధాకర్‌ముదిరాజ్

నిజాంపేట్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ర్యాంక్‌లు సాధిస్తున్నారని బాచుపల్లి కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. విద్యార్థులు సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ, స్థానిక నాయకుడు సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్టు



పోలీసుల అదుపులో జూదరులు. స్వాధీనం చేసుకున్న ఫోన్లు, నగదు

నిజాంపేట్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి పన్నెండు మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేకాడుతున్నారనే సమాచారంతో శుక్రవారం బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లోని ప్రసన్న నిలయంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.1,63,180 నగదుతో పాటు 205 కాయిన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్న బంకురి అప్పన్న(40), కావూరి శైలజ(53), గోపీచంద్(64), మోహనకృష్ణ(64), మజ్జి వర్మ(38), తిరుపతిగౌడ్(47), సింహాచలం(57), వెంకటరమణ(59), సత్యనారాయణమూర్తి(42), వేణు(57), కొల్లి రమేష్(70), వెంకటేశ్వరరావు(57)లపై కేసు నమోదు చేసి వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.